

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 42.0 (ఆదివారం)

కనిష్ఠం : 26.0



ఇది దేవరపల్లి మండలంలోని కృష్ణపాలెంలో వేసిన లేఅవుట్.. లే అవుట్ ఎక్కడుందని వెతుక్కుంటున్నారా.. ఈ కనిపించే చిత్రంలో ఉన్నది లేఅవుటే.. ఈ లేఅవుట్‌కు దారికూడా లేదు.. అయినా పేదలకు ఇచ్చేశారు.. ఇలా జిల్లాలో ఎన్నో ఉన్నాయి..

లే..ఔట్!

నివాసయోగ్యం కాని స్థలాలు రద్దు?

2019 ఎన్నికల ముందు అందరికీ ఇళ్లిస్తామంటే పేదలు నమ్మారు.. ఓటే శారు.. గెలిపించారు.. తీరా చూస్తే.. కొండలు.. గుట్టలు.. చివరికి శ్మశానాలు.. అదీ ఇదీ అని ఏముంది.. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ స్థలాలు ఇచ్చేశారు.. మా పనైందని గత పాలకులు చేతులు దులుపుకున్నారు.. తీరా చూస్తే చాలా లేఅవుట్లలో ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకపోవడానికి కారణమేంటనే దానిపై దృష్టిసారించింది.. అనువుగా లేకపోతే రద్దు చేసే యోచనలో ఉంది.. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో 59 లేఅవుట్లు రద్దు చేసినట్టు సమాచారం.

తూర్పుగోదావరి	
లేఅవుట్లు	526
మంజూరు	73,282
పూర్తయినవి	27,971
వివిధ దశల్లో	18,807
ప్రారంభంకానివి	26,504
వ్యయం	601.65 కోట్లు

కాకినాడ	
లేఅవుట్లు	698
మంజూరు	87,648
పూర్తయినవి	29,009
వివిధ దశల్లో	29,020
ప్రారంభంకానివి	29,619
వ్యయం	681.4 కోట్లు

కోనసీమ	
లేఅవుట్లు	702
మంజూరు	43,561
పూర్తయినవి	15,330
వివిధ దశల్లో	14,921
ప్రారంభంకానివి	13,310
వ్యయం	385.31 కోట్లు

- పేదింటి కల తీర్చేలా అడుగులు
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- లేఅవుట్లపై సర్కారుకు నివేదిక
- తూర్పున 59 లేఅవుట్లు రద్దు
- కాకినాడ, కోనసీమలో పరిశీలన
- కోట్లు ఖర్చు చేసి ఖాళీగా..
- పేదలను మోసగించిన జగన్
- కొత్త స్థలాల ఎంపిక యోచన
- పల్లకడియంలో 598 ఎకరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం పేదలందరినీ మోసం చేసింది.. ఎంతో ఆశగా ఇళ్ల స్థలాలకు ఎదురుచూసిన పేదలకు నిరాశనే మిగిల్చింది.. ఇళ్ల స్థలాలకు పనికిరాని భూములను ఎంపిక చేసి పేదింటి ఆశను నీరుగార్చింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లిస్తామని చెప్పి నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో హడావిడిగా భూమి సేకరించి.. లేఅవుట్లు సిద్ధం చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 526 ప్రాంతాల్లో హడావిడిగా లేఅవుట్లు వేస్తున్నట్టు ప్రకటించి కనీసం చాలా చోట్ల లేఅవుట్లు వేయలేదు.కొన్ని చోట్ల కాగితాలపై లేఅవుట్లు చూపించారు. జిల్లా వ్యాప్తంగా 73,282 మంది లబ్ధిదారులకు సెంటు,సెంటున్నర స్థలం వంతున పట్టాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.కేవలం భూమిని మాత్రమే సేకరించి లేఅవుట్‌వేశారు.మౌలిక వసతులు మాటేమరిచారు. దీంతో 26,504 మంది అసలు ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదు. ఆ లేఅవుట్లు రద్దు చేయనున్నారు.

కోనసీమ జిల్లాలో ఇలా..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నివాసయోగ్యం కాని స్థలాల్లో లేఅవుట్లను రద్దుచేసి అర్హులకు ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం లేఅవుట్లు 702.. ఇళ్ల లబ్ధిదారులే 43,561 ఉండగా వివిధ దశల్లో ఉన్నవి 14,921,పూర్తయినవి 15,330, ప్రారంభంకానివి 13,310 ఉన్నాయి.. మొత్తం వ్యయం 385.31 కోట్లు వ్యయం చేశారు. ఇంత వరకూ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని పట్టాదారుల ఆచూకీపై అధికారులు ఆరా తీసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం.

కాకినాడ జిల్లాలో ఇలా..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలు లబ్ధిదారుల అనాసక్తితో వెలవెలబోతున్నాయి. కాకినాడ జిల్లా పరిధిలో 698 లేఅవుట్లు వేశారు. 87,648 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 29009 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. వివిధ దశల్లో 29020 ఇళ్లు ఉన్నాయి. 29619 ఇళ్లు అయితే ప్రారంభమేకాలేదు.ఈ లేఅవుట్లకు 681.4 కోట్లు వ్యయం చేశారు.నివాస ప్రాంతాలకు దూరంగా ఉండడం,పల్లపు ప్రాంతాలు కావడం,పొలాల మధ్య ఉండడం,సముద్రపు ప్రాంతాల్లో ఇవ్వడం వంటి పరిస్థితుల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు.

అర్బన్‌కు కేరాఫ్ పల్లకడియం

ఇక అర్బన్ ప్రాంతాల లబ్ధిదారులకు ఎంపిక చేసిన లేఅవుట్లు సరిగ్గాలేవు. బూరుగు పూడి, కాపవరం ఆవ ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రతిపాదన వివాదాస్పదనమైన సంగతి తెలి సిందే. దీనిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే వెలుగుబంద కాలనీలోని ఇళ్లను పూర్తి చేస్తుంది.రాజానగరం మండలం పల్లకడియం, కానవరం ప్రాంతాల్లో 12 లేఅ వుట్లకు 598.72 ఎకరాలు సేకరించారు. ఇక్కడ 22,898 మందికి ఇళ్ల నిర్మాణం చేయనున్నారు.గత ప్రభుత్వం సెంటు వంతున స్థలంతో పట్టాలు ఇచ్చి వదిలేసింది.ప్రస్తుత ప్రభుత్వం ఈ స్థలాల్లోనే రెండేసి సెంట్ల వంతున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించడంతో పాటు, మిగిలిన వారికి టిడ్కో ఇళ్లు నిర్మించే యోచనలో ఉంది. బూరుగుపూడి, కాపవరం ప్రాంతాలు ఆవ ప్రాంతంలోని 11, 954 మంది ఎక్కడ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది.వీరంతా రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులే కావడం గమనార్హం.

చంద్రన్న అడుగులు

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ఘన విజయం సాధించి సీఎం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆలోచన చేస్తున్నారు.అసలైన లబ్ధిదారులు ఎంత మంది? ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారెందరు? ఆయా ఇళ్లల్లో ఉంటున్న వారెందరో తెలుసుకునే చర్యలు చేపట్టింది. దీంతో అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేసింది. ఇప్పటి వరకు కనీసం ఒక ఇటుక కూడా వేయకుండా ఖాళీగా ఉంచిన స్థలాల లెక్క తేల్చింది. ఆ పట్టాలను రద్దు చేసి,అర్హులైన నిరుపేదలకు కొత్తగా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది.గత ప్రభుత్వంలా కాకుండా లబ్ధిదారులకు రెండు సెంట్ల భూమి ఇచ్చే ఆలోచన చేస్తోంది.

తూర్పున రద్దు లేఅవుట్లు ఇవే

నివాస యోగ్యంకాని 59 లేఅవుట్లు ఇలా ఉన్నాయి.కడియం మండలం వేమగిరి-3 (జడ్పీ స్థలం).కోరుకొండ మండలం నర్సాపురం- కనపూరు రోడ్డు,జగన్నాథపురం-1,రంగంపేట మండలం వడిశలేరు లేఅవుట్-2, చంద్రేడు లేఅవుట్ -1,ముకుందవరం-2,ఈలకొలను, ఈలకొలను-2, నల్లమిల్లి లేఅవుట్-1, వీరంపాలెం-1, దేవరపల్లి మండలం జగన్నాథపురం రోడ్డులో లేఅవుట్,బుచ్చియ్యపాలెం, కొండగూడెం హౌసింగ్ బోర్డు,గౌరీపట్నం రజకుల చెరువు, యర్నగూడెం పోలేరమ్మ టెంపుల్ లేఅవుట్, కృష్ణపాలెం,ధుమంతునిగూడెం,పల్లంట,కురు కూరు, రాతిగుంటచెరువు లేఅవుట్లు ఉన్నాయి. గోపాలపురం మండలం నందిగూడెం-1, భీమోలు -1 ,వడలకుంట-2,గోపాలపురం- 2,3,4,5, వేళ్లచింతలగూడెం-1,కరగపాడు-2, నల్లజర్ల మండలం నబీపేట-2, నల్లజర్ల -4, జగన్నాథపురం-2, అచ్చన్నపాలెం, సింగరాజుపాలెం-1,2,3 లేఅవుట్లు.నిడదవోలు మండలం తాడిమళ్ల -2, శెట్టిపేట టిడ్కో,ఎస్సీ పేట రామాలయం దగ్గర లేఅవుట్.పెరవలి మండలం ఎలిమెంటరీ స్కూల్ దగ్గర లేఅవుట్, అసైన్డ్‌లాండ్ లేఅవుట్, పాల ఆది నారాయణ షెడ్ దగ్గర లేఅవుట్, రవళి స్పిన్నింగ్ మిల్లు వెనుక,ఎస్సీ పుంత, పిరమిడ్ జ్ఞాన మందిర లేఅవుట్, ఉండ్రాజవరం మండలం అజ్జరం కాలనీ లేఅవుట్లు ఉన్నాయి.



వ్యాన్‌లో తారు కరిగిస్తుండగా మంటలు చెలరేగి దగ్ధమవుతున్న వ్యాన్

వాహనం తారుమాడు!

వేసవిలో ప్రమాదాలు ఎలా జరుగుతాయనేది అనుమానమే..కాస్త ఆదమరుపుగా ఉన్నామా అంతే.. దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో తారు ట్యాంకర్ దగ్ధమే అందుకు నిదర్శనం. ట్యాంకర్‌లో తారు నిల్వచేసినట్టు సమాచారం. బయటకు తీసేందుకు కరిగించే నిమిత్తం వేడి చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈపేలుడు కారణంగా సమీపంలోని రెండు స్లాబులు బీటలు వారాయని , ఎటువంటి ప్రాణనష్టం లేదని తెలిసింది. ఈ మేరకు సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు.ఆస్తినష్టం రూ.లక్షల్లో ఉంటుందని అంచనా వేశారు.ట్యాంకర్ వద్ద మంటలు రావడంతో వాటిని అదుపు చేయడానికి ఫోమ్ ఉపయోగించామని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. - దివాన్‌చెరువు



సివిల్స్ ర్యాంకర్ దొమ్మేటి వినయ్‌ను అభినందిస్తున్న కొవ్వూరు నాయకులు, అధికారులు

ఐఆర్ఎస్ కాదు.. ఐఏఎస్ నా కల

- 274 ర్యాంక్‌కు ఐఆర్ఎస్ వస్తుంది
- ఐఏఎస్ వచ్చే అవకాశం తక్కువ
- మళ్లీ ఐఏఎస్‌కు ప్రయత్నిస్తా
- సివిల్స్ ర్యాంకర్ వినయ్

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కష్టేఫలి అన్నారు పెద్దలు.. ఆ మాటకు అచ్చుగుద్దినట్టు సరిపోతాడు ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు.. ఐఏఎస్ సాధించాలన్నది అతని కల. అయితే రెండు సార్లు తప్పినా ఒప్పుకోలేదు.. మూడో సారి ప్రయత్నించారు.. 274 ర్యాంక్ సాధించాడు.ఆదివారం స్వగ్రామం కొవ్వూరు చేరుకున్నాడు. ఈ మేరకు పలువురు అభినందనలు తెలిపారు. కొవ్వూరుకు చెందిన డి.జగదీశ్వరరావు విద్యుత్‌శాఖలో కొవ్వూరు పట్టణ ఏఈగా పనిచేస్తున్నారు.తల్లి దుర్గ గృహిణి. జగదీశ్వరరావు పెద్ద కుమారుడు సాయి సంతోష్ జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకుమారుడు దొమ్మేటి వినయ్ పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ఎన్ఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచి సివిల్స్ సాధించాలనే కల ఉండడంతో సాఫ్ట్‌వేర్ వైపు చూడలేదు. బీటెక్ పట్టా అందుకున్న వెంటనే సివిల్స్ ప్రయత్నాలు ఆరంభించాడు. మూడు సార్లు ప్రయత్నం చేశాడు. 2022 తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించినా, ఇంటర్వ్యూలో స్వల్ప మార్కులతో చేజారిపోయింది.రెండో సారి అదే పరిస్థితి. మూడో సారి పొలిటికల్ సైన్సు అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ విభాగంలో ప్రయత్నించి 274వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంక్‌కు ఐఆర్ఎస్ వస్తుందని.. ఐఏఎస్ సాధించాలనే నా కలను మరో ప్రయత్నంలో నెరవేర్చుకుంటానని తెలిపాడు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, కొవ్వూరు రూరల్, గోపాలపురం విద్యుత్ శాఖ ఏఈలు సిహెచ్.శ్రీనివాసరావు, దూసనపూడి శ్రీనివాస్, జేఈ కె.వి.వి.సత్యనారాయణ, మొగళ్లపు వెంకట్రావు తదితరులు అభినందనలు తెలిపారు.

7

రాష్ట్రంలో మంచి పాలన : కొల్లు

మద్యానికి డబ్బులివ్వలేదని స్నేహితుడి హత్య

సన్..డేస్!



చల్లబడుతున్నారు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కిటకిట



ఈత నేర్పుతా రారా కన్నా : పుష్కరఘాట్ వద్ద చిన్నారితో సరదా..

మండుతున్న ఎండలు - అల్లాడుతున్న జనం

రాజమహేంద్రవరం సిటీ/పెరవలి/ గోపాలపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ప్రచండ భానుడు విజృంభిస్తున్నాడు. వేసవి ప్రతాపంతో వివిధ వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లమీదకు రావాలంటేనే భయపడుతున్నారు.వ్యవసాయ పనులు ఉదయం పది నుంచి 11 గంటల్లోపే ముగిస్తున్నారు. ప్రజానీకంతో పాటు పశుపక్షాదులు వేసవి తాపానికి అల్లాడుతున్నాయి. పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ళు వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నట్టు రైతులు వాపోతున్నారు. పాడి పశువుల్లో కూడా పాల దిగుబడి తగ్గిపోతుందని పాడి రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏప్రిల్ నెలల్లో ఎండ తీవ్రత ఈ విధంగా ఉంటే మే నెలల్లో ఇంకెంతగా ఉంటాయోనని రైతులు వాపోతున్నారు. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి భూమి ఉపరితలం వేడెక్కి ఉక్కపోతలు ఎక్కువయ్యాయి. మండుతున్న ఎండలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ నెలలో అత్యధికంగా 42 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. ఉదయం 8 గంటలకే వెడెక్కి రాత్రి 8 గంటల వరకు ఆ వేడి తగ్గుముఖం పట్టక చిన్నపిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. ఏసీలు, కూలర్లు ఉన్నవారు వాటిని 24 గంటలు వినియోగిస్తున్నారు. అధిక వేడి తట్టుకోలేక ప్రజలు గోదావరి స్నానాలకు దిగి సేదతీరుతున్నారు.పుష్కరాలరేవు, ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు చేరుకుని గంటల తరబడి గోదావరిలో స్నానాలు చేస్తూ సేదతీరుతున్నారు. శీతల పానీయాలు, కూల్‌డ్రింక్‌లు అమ్మకాలు పెరిగాయి. సాయంత్రం వేళ రాజమహేంద్రవరం పార్కుల్లో ప్రజలు సేదతీరుతున్నారు.



కోళ్లు విలవిల



భానుడికి చిక్కకుండా ఇలా..





బాబోయ్ భరించలేం : పుష్కరఘాట్ వద్ద ఖాళీగా జంక్షన్



ఐదింటా జోరు.. రెండింటా పోరు!

- టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో నీరసం
- అనపర్తి, నిడదవోలు వెనుకబాటు
- రాజమండ్రి,గోపాలపురంలో నూరు
- రెండు నియోజకవర్గాల్లో 70 శాతం
- కొవ్వూరులో 54.35 శాతం
- అధిష్ఠానం తీరుపై అసంతృప్తి
- కూటమి ప్రభావమేనా?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సంస్థాగత ఎన్నికల జోరు పెరిగింది. టీడీపీ ఎమ్మెల్యేలు లేని చోట నేతలపై కూటమి ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలు నీరసంగా ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నుంచి టీడీపీ నేతలకు సరైన గుర్తింపు రాకపోవడమే కారణమనే ప్రచారం సాగుతోంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పొత్తు కారణంగా టీడీపీ నేతలు అవకాశాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి సరైన ప్రాధాన్యత ఇస్తామని అప్పట్లో అధిష్ఠానం చెప్పడంతో పాటు పార్టీ విజయానికి సహకరించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నా అధిష్ఠానం పట్టించుకోకపోవడంపై కాస్త అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరికి మాత్రం రుడా చైర్మన్ పదవి దక్కింది. నిడదవోలు నుంచి త్యాగం చేసిన బూరుగుపల్లి శేషారావుకు ఏ విధమైన గుర్తింపు లభించలేదు. అనపర్తి సీటు బీజేపీకి కేటాయించినా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి టీడీపీ వ్యవహారాలు చూస్తున్నారు. అధికారికంగా ఎటువంటి నియామకం జరగలేదు. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికల్లో బాగా వెనుకబడినట్టు సమాచారం.పాత వర్గాలతో పాటు కొత్త వర్గాల నుంచి నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారు.రాజమహేంద్రవరం నగర టీడీపీ అధ్యక్ష పదవి బీసీ వర్గాలకు దక్కే అవకాశం ఉంది. ఇక్కడ బీసీల నుంచి చాలా మంది ఆశిస్తున్నా రు.మిగతా నియోజకవర్గాల్లో పట్టణ, మండల కమిటీల్లో కొత్తవారు వచ్చే అవకాశాలున్నాయి.

60 మంది ఓటర్లకు ఒక సారథి

60 మంది ఓటర్లకు ఓ కుటుంబ సాధికార సారధి (కెఎస్ఎస్) ఉంటారు. ఇందులో ఇద్దరు సభ్యులు ఒకరు మహిళ, ఒకరు పురుషుడు ఉంటారు. తర్వాత బూత్ గ్రామ, మండల, పట్టణ, డివిజన్, నియోజకవర్గ, పార్లమెంట్ పరిధి కమిటీలతో పాటు, వాటి అనుబంధ కమిటీల ఎన్నికలు పూర్తి కానున్నాయి. ఈనెల 30వతేదీ లోపు క్లస్టర్, యూనిట్, మండల , పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం కూడా పూర్తి కావాలి. మేనెల 1 నుంచి 7వ తేదీ వరకూ నియోజకవర్గాల అనుబంధ కమిటీల నియామకం జరగాలి. మే నెల 8 నుంచి 15వ తేదీ వరకూ పార్లమెంట్ కమిటీలు,అనుబంధ కమిటీలను నియమించాలి.మే నెల చివరలో కడప జిల్లాలో మహానాడును బ్రహ్మాండంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలు పెట్టారు.

ఏ నియోజకవర్గంలో ఎలా..

ఈనెల 14వ తేదీ నుంచి ఎన్నికల సందడి మొదలైన సంగతి తెలిసిందే.కుటుంబ సాధికార సారధుల పదవులు ఇప్పటికే చాలా చోట్ల పూర్తి చేశారు. రాజమహేంద్రవరం సిటీలో కుటుంబ సాధికార సారథులు(కెఎస్ఎస్)లు 4237 నియమించాల్సి ఉంది.ఒక్కో సారధికి ఇద్దరు సభ్యులు ఉంటారు.అంటే 8474 మందిని నియమించాల్సి ఉంది.ఇప్పటికే 8498 మంది నియమించారు. గోపాలపురంలో మొత్తం 4044 కెఎస్ఎస్ ఉండగా 8088 మందిని నియమించాల్సి ఉంది.కానీ 8090 మందిని నియమించి 100.02 శాతం నియామకాలు పూర్తి చేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 4481 కెఎస్ఎస్‌లకు 7198 మందిని నియమించాల్సి ఉండగా ఇప్పటి వరకూ 5398 మంది నియమించి 74.99 శాతం పూర్తి చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కమిటీలతో పాటు మండల స్థాయి కమిటీని నియమించడానికి సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నట్టు సమాచారం. రాజానగరంలో టీడీపీ ఎమ్మెల్యే లేనప్పటికీ, అక్కడి ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ నాయకత్వంలో కమిటీలు జరుగుతున్నాయి. ఇక్కడ 3599 కెఎస్ఎస్‌లకు 7198 మంది సభ్యులను నియమించాల్సి ఉండగా 5398మందిని నియమించి 74.99 శాతానికి చేరుకున్నారు. కొవ్వూరులో 3060 కెఎస్ఎస్‌లకు 6120 మంది సభ్యులను నియమించాల్సి ఉండగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో 3326 మంది 54.35 శాతం మాత్రమే నియామకాలు పూర్తిచేశారు. నిడదవోలులో 3542 కెస్ఎస్‌లకు 7084 మందిని నియమించాల్సి ఉండగా 2509 మందిని మాత్రమే నియమించారు. ఇది కేవలం 35.42 శాతం.ఇక్కడ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు ప్రాధాన్యత ఇవ్వలేదనే ఆగ్రహం పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. ఇక అనపర్తిలో సంస్థాగత ఎన్నికల సందడే కనిపించడం లేదు. బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనయుడు, టీడీపీ నేత మనోజ్ రెడ్డి టీడీపీ తరఫున చురుగ్గా ఉన్నా కమిటీల నియామకం జీరో అని చెప్పవచ్చు.ఇక్కడ మొత్తం 3767 కెఎస్ఎస్‌లకు 7534 మందిని నియమించాల్సి ఉండగా కేవలం 66 మందిని మాత్రమే నియ మించారు. ఇది కేవలం 0.88 శాతమే. ఈ నెల 20వ తేదీకి సారధుల నియామకం పూర్తి కావాల్సి ఉంది.

దైవ దర్శనానికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు

- భక్తులను ఢీకొనడంతో ఒకరు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పుల్లలపాడు హైవే వద్ద ఘటన


మరణించిన అంజి(ఫైల్)

నల్లజర్ల ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవదర్శనం కోసం కాలినడకన వెళ్తున్న భక్తులను లారీ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరపల్లికి చెందిన బిరదా అంజి (25) మృతి చెందాడు. వివరాల ప్రకారం... దేవరపల్లికి చెందిన బిరదా అంజి, దాసు దుర్గాప్రసాద్, జాజు మొగ్గల సాయితేజ శనివారం రాత్రి దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవ దర్శనం కోసం కాలినడకన బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడు హైవే వద్ద వచ్చేసరికి వైజాగ్ నుంచి బళ్లారికి ఇసుప ఊసలు తీసుకెళ్తున్న లారీ వెనుక నుంచి వారిని ఢీకొంది. అంజి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం కాగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అంజిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిని దింపేందుకు వస్తూ..

టిప్పర్ ఢీకొని నలుగురు యువకులకు తీవ్ర గాయాలు

ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన యవకులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న నలుగురు యువకులను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారిపేటకు చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారి పేటకు చెందిన బి.వినోద్ స్నేహితులు. వారు ఆదివారం కాకినాడ, అక్కడి నుంచి యానాం వెళ్లి ఒకే మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావును ఇంటి వద్ద దింపేందుకు వారు వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. గాయపడినవారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్సులో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యానికి డబ్బులివ్వలేదని.. స్నేహితుల చేతుల్లో యువకుడి హత్య


గౌతమ్ (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులివ్వలేదని నలుగురు కలిసి ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నివశిస్తున్న మీసాల గౌతమ్ (27)కు తండ్రి రమేష్, తల్లి జ్యోతి, సోదరి గాయిత్రి ఉన్నారు. కాగా గౌతమ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటాడు. అతడు స్థానిక రేచర్లపేటలోని గుర్రాల వారి వీధిలో ఉంటున్న ఓ యువతిని ప్రేమించాడు. ఈ విషయాన్ని గౌత మ్ తన తల్లిదండ్రులకు చెప్పగా కులాంతర వివాహం కావడంతో వారు పెళ్లికి ససేమిరా ఒప్పుకోలేదు. దాంతో గౌతమ్ ఇంటి వద్ద నుంచి వచ్చేసి గత కొన్ని రోజులుగా ఆ యువతి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో గౌతమ్‌కి స్నేహితులైన నలుగురు యువకులు ఆదివారం ఉదయం తాను ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో క్షణికావేశంలో ఉన్న ఆ నలుగురు పక్కనే ఉన్న కాంక్రీట్ సిమెంట్ రాయితో గౌతమ్ తలపై, ముఖంపై విచక్షణా రహితంగా మోది అక్కడ నుంచి పరారయ్యారు. తీవ్ర రక్త స్రావంతో రక్తపు మడుగులో పడి ఉన్న గౌతమ్‌ను స్థానిక అంబులెన్స్‌లలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కేవీఎస్ హాకీ పోటీల విజేత 'కాకినాడ'


కాకినాడ జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో కేవీఎస్ హైదరాబాద్ రీజనల్ స్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని వెంకటగిరి, కరీంనగర్, కాకినాడ కేంద్రీయ విద్యాలయాల నుంచి 45 మంది బాలురు, విజయవాడ, రాజంపల్లి కేంద్రీయ విద్యాలయాల నుంచి 24మంది బాలికలు హాజరయ్యారు. క్రీడా ఉత్సవానికి శ్రీకారం చుట్టిన కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బొంత శేఖర్, జిల్లా స్థాయి డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షుడు విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అర్థం చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన పోటీ భావనతో ఆటల్లో పాల్గొనాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రతిభను వెలిబుచ్చాలని ఆకాంక్షించారు. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయ మొదటి స్థానం, వెంకటగిరి కేంద్రీయ విద్యాలయం రెండోస్థానం, కరీంనగర్ మూడోస్థానం సాధించాయి. బాలికల విభాగంలో రాజంపల్లి మొదటి, విజయవాడ రెండోస్థానంలో నిలిచాయి. మొదటిస్థానంలో నిలిచిన కాకినాడ, రాజంపల్లి జట్లు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు కేవీఎస్ తరఫున అబ్జర్వర్‌గా కేంద్రీయ విద్యాలయ ఓఎన్‌జీసీ నుంచి కె.మధుసూదనరావు హాజరయ్యారు.

ఆర్ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు


డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అట్లూరి విష్ణువర్ధన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం పూర్తిస్థాయి డీఎంఈగా విజయవాడకు బదిలీ అయ్యారు. 1982 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ విష్ణువర్ధన్ సిద్దార్థ వైద్య కళాశాలలో చదివారు. అనంతరం ఆయన 1991లో మణిపాల్ కస్తూర్బా మెడికల్ కాలేజీలో అనస్థీషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తదుపరి 1997లో ఆర్ఎంసీలో అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన ఆయన 2006లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2015లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది అక్కడే విధులు నిర్వర్తించారు. అనంతరం 2023 ఫిబ్రవరి నుంచి అనస్థీషియా హెచ్‌వోడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2022 ఆగస్టు నుంచి ఆయన ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ఆయన హయాంలో ఆర్థో, ఈఓటి, న్యూరో సర్జరీ ఎమర్జన్సీకి రెండు ఆపరేషన్ థియేటర్లు ప్రారంభించారు. డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో గడిచిన సంవత్సరకాలంలో 14 వేల మేజర్ సర్జరీలు నిర్వహించారు. అలాగే కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో రూ.1.25 కోట్ల నిధులతో మౌళిక సదుపాయాలను అనస్థీషియా విభాగానికి సమకూర్చారు. 5 అనస్థీషియా మెషిన్‌లు, 3 వెం టీలేటర్‌లు, ఒక ఇంక్యుబేటింగ్ బ్రాంకోస్కోప్, ఒక అల్ట్రా సౌండ్ మెషిన్ సమకూర్చారు. ఈ ఏడాది కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో ట్రామాకేర్ యూనిట్‌కు రూ.55 లక్షల నిధులతో 3 వెం టీలేటర్లు, 8 ఐసీయూ పడకలు, మరో 8 మ ల్టీ పేరా మౌంటర్స్ సమకూర్చారు. ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులను అందుకున్నారు.

ముగ్గురు దొంగలు..17 కేసులు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం
- కోనసీమ జిల్లా ఎస్పీ వెల్లడి



అమలాపురంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాలవారివీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ అంతర్‌రాష్ట్ర ముగ్గురు సభ్యుల ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ వివరాలను అమలాపురం ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు.

జనవరి 11న అమలాపురంలోని కురసాలవారివీధిలో గల ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తలుపు బోల్టు తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు (33), అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు (35)లు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడప 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేధించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్‌ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్‌ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి వారిని అభినందించారు.

రాష్ట్రంలో మంచి పాలన

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

గంగాలమ్మతల్లి జాతరలో ప్రత్యేక పూజలు


జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి రవీంద్ర

నల్లజర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయానికి వెళితే ఎక్కడా పవిత్రత అనేది కనిపించలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో మంచి పాలన కొనసాగిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో గంగాలమ్మ తల్లి జాతరకు ఆయనతో పాటు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి పీతల సుజాత, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ అధ్య క్షురాలు ఆచంట సునీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకతీతంగా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈరోజు అదే ఆలయానికి వెళితే మనస్సుకు ప్రశాంతత కలిగిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుల, మతాల మధ్య చిచ్చుపెట్టొద్దన్నారు. అందుకు భగవంతుడు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాడన్నారు. అందుకే 164 సీట్లను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.259 కోట్ల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఘంటవారిగూడెంలో 100ఏళ్ల తరువాత జాతర జరగడం ఆనందదాయకమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్య నారాయణ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, కూచిపూడి ఉదయ భాస్కర్,నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి తదితరులున్నారు.

తొండవరంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం


యాగం నిర్వహిసున్న పండితులు

అంబాజీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం గ్రామంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం ఆదివారం అమవాస్యనాడు ఘనంగా ప్రారంభమైంది. 60ఏళ్ల క్రితం నిర్వహించిన ఈయాగాన్ని తిరిగి తొండవరం శ్రీ తొండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. దు వ్వూరి వెంకట సూర్య ప్రకాశయజ్వ -కనకదుర్గా దంపతులు యాగ కర్తలుగా వ్యవహరించారు. సర్వపృష్ఠాప్తోర్యామ యాగంలో(మహాగ్నిచయనం) భాగంగా ప్రత్యేక ఆకారాలు కలిగిన వెయ్యి ఇటుకలను ప్రత్యేక మంత్రాలతో అమరుస్తామని, ఇలా పేర్చిన ఇటుకలన్నీ గురుడపక్షి ఆకారాన్ని సంతరించుకుంటాయన్నారు. ఈ యాగాన్ని దువ్వూరి యజ్ఞేశ్వరపౌండరీక యాజులు 60ఏళ్ల క్రితం కపిలేశ్వరపురంలో నిర్వహించారు. అమవాస్యనాడు ఈ యాగాన్ని ప్రారంభించడం ఎంతో శక్తివంతమైందన్నారు. 10రోజులు జరిగే ఈ యాగంలో వివిధ కార్యక్రమాలు, క్రతువులు ఉంటాయని, యాగాన్ని వీక్షిస్తే మంచి జరుగుతుందని వేదపండితులు తెలిపారు.

జీజీహెచ్‌లో రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగం నందు రోడ్డు ప్రమాదాలు, ఇతర గాయాలకు సంబంధించి ఆదివారం రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి కాకినాడ ఆర్ఎంసీ, రాజమహేంద్రవరం జిఎస్‌ఎల్ మెడికల్ కాలేజ్, అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీల నుంచి సుమారు 100మంది జనరల్ సర్జరీ పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అలాగే కాకినాడ, గుంటూరు, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జయపాల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ సాగర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రాంమోహన్ పాల్గొని వైద్య విద్యార్థులకు నూతన శస్త్రచికిత్సా విధానాలు, నూతన మెళకువలు, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం చర్చా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం మాట్లాడారు. విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవిష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌రావు, డాక్టర్ శైలజ, డాక్టర్ శైలజారాణి ఉన్నారు.


జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ విఠల్

సత్యదేవుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం


దేవదాయ మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వచ్చే నెల 8న జరిగే స్వామి వారి దివ్యకల్యాణానికి విచ్చేయాలని ఆదివారం దేవదాయమంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి ఈవో సుబ్బారావు ఆహ్వానపత్రికను అందజేశారు. కల్యాణోత్సవాలు వచ్చే నెల 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవో మంత్రికి వివరించగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కు ఆహ్వానపత్రికను అందజేయగా.. 2,3రోజుల్లో మిగిలినవారికి అందజేస్తామని దేవస్థానం వర్గాలు తెలిపాయి.

రూ.లక్ష విరాళం

రత్నగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన ఇసరపు మానేశ్వరరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ప్రోటోకాల్ అధికారి శొంఠి మూర్తికి అందజేయగా ఆయన అభినందించి స్వామి వారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాత

'లోవ'లో గంధామావాస్య వేడుకలు


విశేష పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో గంధామావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమ్మవారికి విశేష పూల అలంకరణ గావించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి రూ.3.05 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ సిలబస్

తిరుమల విద్యాసంస్థల చైర్మన్

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా చైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను వారికి అందించాలని అప్పుడే పరీక్షల్లో ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయగలుగుతారని తెలిపారు. పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి కళాశాల్లో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన అవసరమన్నారు. అనంతరం డైరెక్టర్ నున్న సరోజని దేవి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించే ప్రయత్నం చేయాలన్నారు. పిల్లలు పుస్తకాలతో కంటే మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని వివరించారు. సదస్సుకు 15వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. తిరుమల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల అచ్చిబాబు, ఏఎస్‌వీ సత్యనారాయణ (నాని మాస్టర్) పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

నేడు తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాల్టీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుంది. ఈ రెండు పదవులకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక లాంఛనమే. 30 మంది సభ్యులుగా గల తుని మున్సిపాల్టీలో టీడీపీకి 17 మంది సభ్యులు బలం ఉంది. దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక అవకాశం ఉంది. ఇప్పటికే చైర్మన్, వైస్ ఎన్నికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం చేశామని కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్యే యనమల దివ్యకు సమాచారం అందించామన్నారు. ఉదయం 11గంటలకు ఎన్నికల అధికారి, డీపీవో వి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరుగుతుందన్నారు. ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసుల ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. కేవలం ఓటింగ్‌లోనే పాల్గొనే సభ్యులు, గుర్తింపుకార్డు పొందిన పాత్రికేయులకు మాత్రమే అనుమతిఉంటుందని తెలిపారు.

సిఫార్సు లెటర్స్ రద్దు వార్తలు అవాస్తవం

టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల

జగ్గంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ దర్శనానికి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సు లెటర్స్ మే 1 నుంచి జూన్ 30 వరకు రద్దు అని వస్తున్న వార్తలు అవాస్తవం అని టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ పాలకమండలి బోర్డు సిఫార్సు లెటర్స్ రద్దుపై ఎటువంటి తీర్మానం చేయలేదన్నారు. సిఫార్సు లెటర్స్ యధాతధంగా కొనసాగుతాయని నెహ్రూ పేర్కొన్నారు.

ఇంటిపై నుంచి జారి పడి బీహార్ కార్మికుడి మృతి

గొల్లప్రోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన బీహార్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. బీహార్ రాష్ట్రంలోని వెస్ట్ చంపారన్ జిల్లా రామ్‌నగర్ తాలూకా నౌరంగియా గ్రామానికి చెందిన 15మంది కార్మికులు సీజనల్ పనుల నిమిత్తం గొల్లప్రోలుకు వచ్చారు. నెలరోజులుగా పట్టణంలోని పిండి ధనరాజు వద్ద ధాన్యం ఆరబెట్టే పనుల్లో కుదిరారు. వారు ఉండేందుకు పట్టణంలో ఒక ఇంటిని సమకూర్చారు. ఈనెల 25న అర్ధరాత్రి 2గంటల సమయంలో ఘణశ్యాం మహతో(44) ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత పిఠాపురం, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. వారి మేస్త్రీ సునీల్ మహతో ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

కోరుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు 2 పేకాట శిబిరాలపై జరిపిన దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చింపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5600 నగదు సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కోటికేశవరం గ్రామశివారులో దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4640 నగదును, 9 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కంచి విశ్వవిద్యాలయంలో 20 మందికి ప్రవేశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయంలో కాకినాడ చుట్టుపక్కల నుంచి సుమారు 20 మంది ప్రవేశం పొందినట్టుగా విద్యాలయ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక ప్రతాప్‌నగర్ చల్లా వారి కల్యాణ మండపంలో వేద స్మార్త పండితులు ఆకెళ్ళ మురళీకృష్ణ, చల్ల నిరంజన్ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 100 మంది విద్యార్థులు హాజరుకాగా 20మంది గ్రాడ్యుయేటు, పోస్ట్ గ్రాడ్యుయేటు కోర్సులు స్వీకరించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

రంగంపేట/రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రంగంపేట, సీతంపేట శాఖా గ్రంథాలలయాల్లో ఈ నెల 28నుంచి జూన్ 6వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాల అధికారులు నల్లమిల్లి రామకోటేశ్వరరావు, ఎం.వీరలింగం,డి.రాజు ఆదివారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే ఈ తరగతుల్లో కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్‌క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్, నృత్యం, గణితం, సృజనాత్మక కార్యక్రమాలపై 40 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులను గ్రంథాలయాలకు పంపి ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 99635 94601, 99494 88341 ఫోను నెంబర్లలో సంప్రదించాలని ఎం.వీరలింగం, డి.రాజు పేర్కొన్నారు. జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
ఏబీసీ సెంటర్ ప్రారంభం



ఏబీసీ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి కుక్కల బెడద లేకుండా చేసేందుకు 101 కెనాల్స్ ద్వారా అధికారులు చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో రూ.65.80 లక్షలతో నిర్మించిన ఏబీసీ సెంటర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసిందని, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో ఒక ఆపరేషన్ థియేటర్ ద్వారా రోజుకు 20-25 కుక్కలకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసేవారని, సమస్య తీవ్రత దృష్ట్యా ప్రస్తుతం రెండో ఆపరేషన్ థియేటర్, షెడ్డును ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా రోజుకు 50 కుక్కలకు బర్త్‌కంట్రోల్ ఆపరేషన్లు చేస్తారని, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, రాచపల్లి ప్రసాద్, నల్లం శ్రీను, కొయ్యల రమణ, కంటిపూడి శ్రీను, దుత్తరపు గంగాధర్, మొకమాటి సత్యనారాయణ, తురకల నిర్మల పాల్గొన్నారు.

నాకు ప్రాణహాని ఉంది

పోలీసులకు కంబాల శ్రీనివాసరావు ఫిర్యాదు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గోకవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గోకవరానికి చెందిన కొంతమంది వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సీఎండీ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సంస్థలో పనిచేసిన ఓ వ్యక్తి జూదం, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తన పేరు ప్రఖ్యాతులకు మచ్చ తెచ్చాడని, దీంతో ఆయనను సంస్థ నుంచి దూరం పెట్టామని, అదే సమయంలో తన సమీప బంధువైన మరో వ్యక్తి అతడితో కలిసి బయటకు వెళ్లిపోయాడన్నారు. వారిద్దరూ తనను పలు మార్లు దూషించారని, తన కార్యాలయానికి, ఇంటికి వచ్చి దాడికి ప్రయత్నించారన్నారు. ఒక్కొక్కరికి రూ.2 కోట్లు ఇస్తేనే గోకవరంలో ఉండనిస్తామని, లేకుంటే దాడులు చేసి పరువు ప్రతిష్టలకు భంగం కల్గిస్తామని బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు. వారిద్దరితోపాటు మరో బంధువు కూడా తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, త్వరలోనే వాటిని బయట పెడతానని శ్రీనివాసరావు వెల్లడించారు. సమావేశంలో రామసేన సభ్యులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, పసల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జీబీఆర్-ఐఎమ్ఏ ఉచిత విద్యా పథకం పరీక్ష



డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఐఎంఏ వైద్యులు

అనపర్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులకు ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో అనపర్తిలోని జీబీఆర్ విద్యా సంస్థలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనపర్తి శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత విద్య పథకానికి ఆదివారం జీబీఆర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 1029మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 1 నుంచి పదో తరగతి వరకు ప్రతిభ కనబరిచి మొదటి ఐదు స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్యను అందించనున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలలో తరగతికి ఐదుగురు చొప్పున లాటరీ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఐఎమ్ఏ అనపర్తి అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, నేత్ర వైద్యుడు డాక్టర్ తేతలి వెంకటరామిరెడ్డి, జీబీఆర్ విద్యా సంస్థల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలల చిన్నారి కిడ్నీకి శస్త్రచికిత్స

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తల్లి కడుపులో శిశువుకు కిడ్నీవాపు ఉన్నట్టు గుర్తించిన వైద్యులు బిడ్డ పుట్టిన ఐదునెలలో కిడ్నీ శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఈ సంఘటన స్థానిక దానవాయిపేటలోని వీ-స్టార్ హాస్పిటల్‌లో జరిగింది. తల్లి కడుపులో ఉన్న శిశువుకు కిడ్నీ వాపు ఉన్నట్టు గుర్తించిన యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ వెంకట చైతన్య సింగంశెట్టి ఆ శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రసవం అయ్యాక ఐదు నెలల్లో సానుకూల పరిస్థితి ఏర్పడ్డాక శస్త్ర చికిత్స విజయం చేసి కిడ్నీ పనితీరు మెరుగుపరిచారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బుర్రిలంకలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన పి.కొండారత్నం, ఎం.త్రివేణి కుటుంబాలను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు ఏర్పాటు చేసిన రూ. 30 వేలు, స్వీయ నిధులు రూ.10 వేలు కలిపి బాధితులకు అందజేశారు. హౌసింగ్‌లో ఇంటి నిర్మాణం రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పాటంశెట్టి రాంజీ, వెలుగుబంటి నాని, గట్టి సుబ్బారావు, పంతం గణపతి, బోడపాటి గోపి, గెడ్డం శివ, వారా రాము పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని పశ్చిమగోనగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన వారిని పెందుర్తి సేవా సమితి ద్వారా ముఖ్యమంత్రి టూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అబిరాం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించారు. పక్కా గృహాలు వచ్చేలా కూటమి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల దేవిక, కుచ్చు చల్లారావు, కొయ్యా శామ్యూల్, మింగి లక్ష్మీనారాయణ, కట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోనగూడెంలో అన్న సమారాధన



దండి గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పుగోనగూడెం గ్రామ దేవత దండి గంగమ్మ తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో చాగల్నాడు కాలువ చైర్మన్ అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు గళ్లా రంగా, వీరమహిళలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక రాజేంద్రనగర్‌లో శ్రీ గజ్జాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదానం జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు మూడు వేలకు పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ప్రవీణ్ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నక్కా దేవీ ప్రసాద్, బొంతా శ్రీహరి, బళ్ళా శ్రీనివాసరావు, జక్కంపూడి అర్జున్, కాలెపు సాయిరామ్, సారిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

» ఎల్ఐసీ ఉద్యోగులు విజయవంతం చేయాలి
» యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సౌత్ సెంట్రల్ జోన్ ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల భవన్‌లో రాజమండ్రి డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా సుమారు 10కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లు, ప్రజా వ్యతిరేక ఆర్థిక నిర్ణయాలకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడడానికి, తమ నిరసనను తెలియజేయనున్నామని పేర్కొన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ తదితర ఆర్థిక సంస్థల ఉద్యోగులతో పాటు ఇతర రంగాల్లో ఉన్న శ్రామిక వర్గమంతా కలిసి ఇచ్చిన సమ్మె పిలుపును విజయవంతం చేయడంలో జీవిత బీమా ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. సమావేశ ప్రారంభంలో కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఉద్యోగుల ప్రెసిడెంట్ అధ్యక్షుడు ఎస్సార్ మాథ్యూస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజమండ్రి ఎల్ఐసీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్, ఎస్.గన్నెయ్య, ఏకే విశ్వనాథ్, రమేష్‌బాబు, ఆర్.శిరీష, కళాధర్, రాజ్యం, ఉమాదేవి, రమణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణం రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోవాలని, కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని తదితర డిమాండ్లతో మే 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈమేరకు ఆదివారం రాజమహేంద్రవరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల జిల్లా నాయకుల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు జేవీ, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు జోజి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఇన్‌చార్జి జేటీ రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు సి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కరోనా సమయంలో పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా దొడ్డి దారిన నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని అన్నారు. లేబర్ కోడ్స్ ప్రమాదాన్ని వివరించేందుకు జిల్లా స్థాయిలో ఒక సదస్సు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. నాయకులు పవన్, ఎస్ఎస్ మూర్తి, పూర్ణిమరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

రంగంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వడిశలేరు సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు సత్కరించారు. ఆదివారం వడిశలేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆత్కూరి లక్ష్మీప్రియాంక్(583), పాలా హెచ్ఎస్‌వీవీ కృష్ణ(576), ఉయ్యూరి దేవి మౌనిక (567)లను శాలువ కప్పి సత్కరించారు.

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జరుగనున్న సరస్వతి నది పుష్కరాలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్బం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మే 14వ తేదీ సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం నుంచి సూపర్‌లగ్జరీ ప్రత్యేక బస్సులు బయలుదేరి యాదగిరిగుట్ట, బాసర, ధర్మపురి, కాళేశ్వరం (సరస్వతి పుష్కరస్నానం), కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్ప క్షేత్రాలు దర్శించుకుని సరస్వతి పుష్కరస్నానం అనంతరం తిరిగి చేరుకుంటాయని తెలిపారు. నాలుగు రోజుల యాత్రలో 8 క్షేత్రాలు దర్శించుకోవచ్చని, టిక్కెట్టు ఛార్జీ ఒక్కరికి రూ.3,900 అని తెలిపారు. బస్సులకు సరిపడినంత మంది భక్తులు ఉంటే తగిన రుసుముతో యాత్రికులు ఉన్నచోటకే బస్సులు పంపడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 95023 00189, 99666 66544లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

లూథర్‌గిరిలో బంగారం చోరీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పేపరు మిల్లు సమీపంలో లూథర్‌గిరిలో ఒక ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. లూథర్‌గిరికి చెందిన ఎ.చిట్టిబాబు ఈనెల 25న ఇంటికి తాళాలు వేసి ఊరెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, లోపలికి వెళ్లి చూస్తే బీరువా తలుపులు తీసి ఉన్నాయని, అందులో పెట్టిన 12గ్రాములు బంగారం, వెండి వస్తువులు, ఇంట్లో టీవీ కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడినట్టు గ్రహించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీహెచ్ఏలకు పదోన్నతులు కల్పించాలి

ఏపీ ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



సంఘీభావం తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హెల్త్ డిపార్టుమెంట్‌లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు(ఎంపీహెచ్ఏ)గా విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులకు మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు(ఎంపీహెచ్ఎస్)గా పదోన్నతులు కల్పించాలని ఏపీ ఉమెన్ హెల్త్ డిపార్టుమెంట్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకే ఎస్.జయలక్ష్మి కోరారు. రాజమహేంద్రవరంలోని ఏపీఎన్‌జీవో హోంలో ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. 28 ఏళ్లుగా ఎంపీహెచ్ఏలుగా పనిచేస్తున్న వారికి ఎంపీహెచ్ఎస్‌గా అవకాశం ఉన్నా పదోన్నతులు కల్పించడంలేదన్నారు. జోనల్ లిస్ట్ తప్పులతడకగా ఉందన్నారు. దానిని వెంటనే సరిచేసి లిస్టును కమ్యూనికేట్ చేయాలన్నారు. కాకినాడలో డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి లిస్ట్ రాలేదని చెబుతున్న ఉన్నతాధికారులు వెంటనే ఆ లిస్ట్‌ను రప్పించి పదోన్నతులు కల్పించాలన్నారు. 2211 హెడ్‌లో పని చేస్తున్న ఎంపీహెచ్ఏలకు ఎఫ్‌టీఏలు రావడం లేదని, వెంటనే ఇప్పించాలని, అడిషనల్ హెచ్ఆర్ఏ ఈ నెల నుంచి జీతం నుంచి కట్ చేస్తున్నారని ఈ దారుణం ఆపి హెచ్ఆర్ఏను ఇప్పించాలని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ తొలగించాలని, హెల్త్ డిపార్టుమెంట్‌లో ఎంపీహెచ్ఏలకు ఏపీవీలు తగ్గించి పనిభారం తగ్గించాలని, పించను సదుపాయం కల్పించాలని, వార్డు సెక్రటరీల నుంచి ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పించి ఎంపీహెచ్ఏగా చేయాలని కోరారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానాలు చేశారు. సమావేశంలో అసోసియేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు జె.విజయమ్మ, అధ్యక్షురాలు ఆర్.సూర్యకుమారి, తూర్పుగోదావరి జిల్లా జిల్లా అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, జి.శారద, కోశాధికారి సీహెచ్ సత్యశ్రీ, జి.పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్ల హక్కుల సాధనకు సమష్టి కృషి

జనరల్ బాడీ సమావేశంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ నేతలు



సమావేశానికి హాజరైన ఆలిండియా నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఆఫీసర్స్ హక్కుల సాధనకు అధికారులంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి రూపమ్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం జరిగిన ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ 3వ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధికారుల హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ దేశవ్యాప్తంగా ఉన్న మన అసోసియేషన్ ఏ సమస్యపైనైనా సమష్టిగా పోరాడి సాధించుకోవచ్చన్నారు. సమావేశానికి ఏఐఎస్‌బీవోఎఫ్ అధ్యక్షుడు అరుణకుమార్ బిషోయ్, అమరావతి సర్కిల్ అధ్యక్షుడు విశ్వనాథ్, ఎస్‌బీఐ జీఎం శ్రీశైలేష్‌కుమార్, డీజీఎం సీడీవో రాహుల్ సంక్రిత్య, రాజమండ్రి మాడ్యుల్ చీఫ్ రీజనల్ సెక్రటరీ టి.శేషుకుమార్, ఇతర రాష్ట్రాల సర్కిల్ అధ్యక్షులు హాజరయ్యారు.

ఏఎంసీ చైర్మన్ పదవిని రాజానగరానికి కేటాయించాలి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గతంలో నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాల వారు చేశారని, ఈ దఫా రాజానగరం మండలానికి కేటాయించి సమన్యాయం చేయాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావును కలిసి విజ్ఞప్తి చేసినట్టు రాష్ట్ర గౌడసాధికార సమితి డైరెక్టర్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంక మల్లికార్జునస్వామి (మల్లిబాబు) ఆదివారం తెలిపారు. టీఎన్‌టీయుసీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాసరావు కలిసి వెళ్లి ఈ మేరకు విన్నవించినట్టు చెప్పారు. కాగా టీడీపీ ఆవిర్భావం నుంచీ తన తండ్రి సూర్యనారాయణ పార్టీకి అనేక సేవలందించారని, తాను కూడా పార్టీకి సేవలందిస్తున్నానని వివరించారు. తమ సేవలను పరిగణలోకి తీసుకుని తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించి రాజానగరం ఏఎంసీ చైర్మన్ పదవికి తన భార్య మాధవిని ఎంపిక చేయాలని కోరినట్టు మల్లిబాబు పేర్కొన్నారు.

వీరవరంలో పూర్వ విద్యార్థుల కలయిక



వీరవరం జడ్పీ హైస్కూల్ 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కడియం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదా సరదా కబుర్లతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పంపన సురేష్, ఆకుల రాజేష్, కొమ్మన దుర్గారావు, గట్టి గంగరాజు, కొత్తపల్లి శివకుమార్, గంగరాజు దుర్గాప్రసాద్, చింతపర్తి చిట్టిబాబు, రావిపాటి సురేష్, కొత్తపల్లి పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

రాజానగరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగోనగూడెంలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన శెనగశెట్టి రామస్వామి, పి.ముత్యాలరావుల కుటుంబాలు ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ముత్యాలరావు కుమార్తెకు చెందిన పదో తరగతి సర్టిఫికెట్లతో పాటు విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాజమహేంద్రవరం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది యంత్రాల సహాయంతో మంటలను అదుపు చేసినట్టు స్థానికులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని కోరారు.

సీఎంతో షేటర్‌పై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం

పెందుర్తి అభిరామ్



కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతున్న అభిరామ్

కోరుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో టీడీపీని డ్యామేజ్ చేస్తూ కొందరు వ్యక్తులు సీఎంతో షేటర్ అంటూ గ్రూపుల్లో ఫొటోలు పెట్టి సోషల్ మీడియాలో ప్రసారం చేయడం తమ దృష్టికి వచ్చిందని దీనిపై జిల్లా ఎస్పీ, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని, మాజీ ఎమ్మెల్యేపెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కోరుకొండ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. టీడీపీ అనుచరుడంటూ చెప్పుకునే వ్యక్తి సోషల్ మీడియా గ్రూపుల్లో ఫొటోలుపెట్టడంపై పార్టీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళతామని, ఆయనకు తెలియకుండానే ఇవన్నీ జరుగుతున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఎంపీ పురందేశ్వరి సమావేశంలో కొందరు దురుసుగా ప్రవర్తించారని, ఫ్లెక్సీలు చించివేశారన్నారు.

టీడీపీ కార్యకర్తలకు ఉచిత విమాన ప్రయాణ సౌకర్యం

సీఎం చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని 75 మంది పేద, నిరుపేద టీడీపీ కార్యకర్తలకు పెందుర్తి సేవా సమితి ద్వారా ఉచిత విమాన ప్రయాణం సౌకర్యం కల్పించనున్నట్టు పెందుర్తి అభిరాం పేర్కొన్నారు. ఒక్కో మండలం నుంచి 25 మంది చొప్పున కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన 75మందిని ఎంపిక చేసి త్వరలో మధురపూడి విమానాశ్రయంలో విమానం ఎక్కించి ఉచితంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వెళ్లే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు మింగి లక్ష్మీనారాయణ, శీలం ఏడుకొండలు, కోర్పు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

ముగ్గురి అరెస్టు, 40 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సారా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడిచేసి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. మండలంలోనిఈలకొలను గ్రామశివారు కోతుల మెట్ట వద్ద సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా అచ్యుతాపురం గ్రామానికి చెందిన కురుకూరి దుర్గాప్రసాద్, పేర్ల రాంబాబు, పేరూరి లక్ష్మణరావు సారా తయారుచేస్తూ పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నిందితులను పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. మహా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోగినేని రత్నాకరరావు ఊపిరితిత్తుల పనితీరు, వాటికి సంక్రమించే వ్యాధులు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సభ్యులకు ఉచితంగా బ్లడ్, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ రత్నాకరరావును వాకర్స్ క్లబ్ సభ్యులు సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఉండవల్లి సత్యనారాయణ, మూర్తి, లక్ష్మీనారాయణ, వాసు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సొంగం ఆడమ్స్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రానికి చెందిన డాక్టర్ సొంగ ఆడమ్స్ నింశీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రాన్ని అందుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 1న ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన సంగీత వాయిద్యాల ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1100 మంది సంగీత కళాకారులు పాల్గొనగా సరళీ స్వరాలను గంటపాటు కీబోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రాంలో అప్లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్టు ఆడమ్స్ తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆడమ్స్ తరుపున ఆయన తల్లిదండ్రులు సునీల్, రోజారాణి గిన్నిస్ ధ్రువపత్రాన్ని అందుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసున మోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పోస్టాఫీసు వీధికి చెందిన బొరుసు సూర్యచంద్రం ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు ప్రక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా కనిపించకపోవడంతో భార్య ఆదిలక్ష్మి పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96622, 91548 75583 నెంబర్లకు సమాచారం అందజేయాలన్నారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (ఆదివారం)
కనిష్ఠం : 26.0



ఇది దేవరపల్లి మండలంలోని కృష్ణపాలెంలో వేసిన లేఅవుట్.. లే అవుట్ ఎక్కడుందని వెతుక్కుంటున్నారా.. ఈ కనిపించే చిత్రంలో ఉన్నది లేఅవుటే.. ఈ లేఅవుట్‌కు దారికూడా లేదు.. అయినా పేదలకు ఇచ్చేశారు.. ఇలా జిల్లాలో ఎన్నో ఉన్నాయి..

లే..ఔట్!

నివాసయోగ్యం కాని స్థలాలు రద్దు?

2019 ఎన్నికల ముందు అందరికీ ఇళ్లిస్తామంటే పేదలు నమ్మారు.. ఓటే శారు.. గెలిపించారు.. తీరా చూస్తే.. కొండలు.. గుట్టలు.. చివరికి శ్మశానాలు.. అదీ ఇదీ అని ఏముంది.. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ స్థలాలు ఇచ్చేశారు.. మా పనైందని గత పాలకులు చేతులు దులుపుకున్నారు.. తీరా చూస్తే చాలా లేఅవుట్లలో ఒక్కరూ ఇళ్లు నిర్మించు కోలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకపోవడానికి కారణమేంటనే దానిపై దృష్టిసారించింది.. అనువుగా లేకపోతే రద్దు చేసే యోచనలో ఉంది.. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో 59 లేఅవుట్లు రద్దు చేసినట్టు సమాచారం.

తూర్పుగోదావరి	
లేఅవుట్లు	526
మంజూరు	73,282
పూర్తయినవి	27,971
వివిధ దశల్లో	18,807
ప్రారంభంకానివి	26,504
వ్యయం	601.65 కోట్లు

కాకినాడ	
లేఅవుట్లు	698
మంజూరు	87,648
పూర్తయినవి	29,009
వివిధ దశల్లో	29,020
ప్రారంభంకానివి	29,619
వ్యయం	681.4 కోట్లు

కోనసీమ	
లేఅవుట్లు	702
మంజూరు	43,561
పూర్తయినవి	15,330
వివిధ దశల్లో	14,921
ప్రారంభంకానివి	13,310
వ్యయం	385.31 కోట్లు

- పేదింటి కల తీర్చేలా అడుగులు
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- లేఅవుట్లపై సర్కారుకు నివేదిక
- తూర్పున 59 లేఅవుట్లు రద్దు
- కాకినాడ, కోనసీమలో పరిశీలన
- కోట్లు ఖర్చు చేసి ఖాళీగా..
- పేదలను మోసగించిన జగన్
- కొత్త స్థలాల ఎంపిక యోచన
- పల్లకడియంలో 598 ఎకరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
గత ప్రభుత్వం పేదలందరినీ మోసం చేసింది.. ఎంతో ఆశగా ఇళ్ల స్థలాలకు ఎదురుచూసిన పేదలకు నిరాశనే మిగిల్చింది.. ఇళ్ల స్థలాలకు పనికిరాని భూములను ఎంపిక చేసి పేదింటి ఆశను నీరుగార్చింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లిస్తామని చెప్పి నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో హడావిడిగా భూమి సేకరించి.. లేఅవుట్లు సిద్ధం చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 526 ప్రాంతాల్లో హడావిడిగా లేఅవుట్లు వేస్తున్నట్టు ప్రకటించి కనీసం చాలా చోట్ల లేఅవుట్లు వేయలేదు.కొన్ని చోట్ల కాగితాలపై లేఅవుట్లు చూపించారు. జిల్లా వ్యాప్తంగా 73,282 మంది లబ్ధిదారులకు సెంటు,సెంటున్నర స్థలం వంతున పట్టాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.కేవలం భూమిని మాత్రమే సేకరించి లేఅవుట్‌వేశారు.మౌలిక వసతులు మాటేమరిచారు. దీంతో 26,504 మంది అసలు ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదు. ఆ లేఅవుట్లు రద్దు చేయనున్నారు.

అర్బన్‌కు కేరాఫ్ పల్లకడియం

ఇక అర్బన్ ప్రాంతాల లబ్ధిదారులకు ఎంపిక చేసిన లేఅవుట్లు సరిగ్గాలేవు. బూరుగు పూడి, కాపవరం ఆవ ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రతిపాదన వివాదాస్పదనమైన సంగతి తెలి సిందే. దీనిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే వెలుగుబంద కాలనీలోని ఇళ్లను పూర్తి చేస్తుంది.రాజానగరం మండలం పల్లకడియం, కానవరం ప్రాంతాల్లో 12 లేఅ వుట్లకు 598.72 ఎకరాలు సేకరించారు. ఇక్కడ 22,898 మందికి ఇళ్ల నిర్మాణం చేయనున్నారు.గత ప్రభుత్వం సెంటు వంతున స్థలంతో పట్టాలు ఇచ్చి వదిలేసింది.ప్రస్తుత ప్రభుత్వం ఈ స్థలాల్లోనే రెండేసి సెంట్ల వంతున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించడంతో పాటు, మిగిలిన వారికి టిడ్కో ఇళ్లు నిర్మించే యోచనలో ఉంది. బూరుగుపూడి, కాపవరం ప్రాంతాలు ఆవ ప్రాంతంలోని 11, 954 మంది ఎక్కడ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది.వీరంతా రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులే కావడం గమనార్హం.

కోనసీమ జిల్లాలో ఇలా..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నివాసయోగ్యం కాని స్థలాల్లో లేఅవుట్లను రద్దుచేసి అర్హులకు ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం లేఅవుట్లు 702.. ఇళ్ల లబ్ధిదారులే 43,561 ఉండగా వివిధ దశల్లో ఉన్నవి 14,921,పూర్తయినవి 15,330, ప్రారంభంకానివి 13,310 ఉన్నాయి.. మొత్తం వ్యయం 385.31 కోట్లు వ్యయం చేశారు. ఇంత వరకూ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని పట్టాదారుల ఆచూకీపై అధికారులు ఆరా తీసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం.

కాకినాడ జిల్లాలో ఇలా..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)
గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలు లబ్ధిదారుల అనాసక్తితో వెలవెలబోతున్నాయి. కాకినాడ జిల్లా పరిధిలో 698 లేఅవుట్లు వేశారు. 87,648 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 29009 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. వివిధ దశల్లో 29020 ఇళ్లు ఉన్నాయి. 29619 ఇళ్లు అయితే ప్రారంభమేకాలేదు.ఈ లేఅవుట్లకు 681.4 కోట్లు వ్యయం చేశారు.నివాస ప్రాంతాలకు దూరంగా ఉండడం,పల్లపు ప్రాంతాలు కావడం,పొలాల మధ్య ఉండడం,సముద్రపు ప్రాంతాల్లో ఇవ్వడం వంటి పరిస్థితుల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు.

చంద్రన్న అడుగులు

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ఘన విజయం సాధించి సీఎం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆలోచన చేస్తున్నారు.అసలైన లబ్ధిదారులు ఎంత మంది? ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారెందరు? ఆయా ఇళ్లల్లో ఉంటున్న వారెందరో తెలుసుకునే చర్యలు చేపట్టింది. దీంతో అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేసింది. ఇప్పటి వరకు కనీసం ఒక ఇటుక కూడా వేయకుండా ఖాళీగా ఉంచిన స్థలాల లెక్క తేల్చింది. ఆ పట్టాలను రద్దు చేసి,అర్హులైన నిరుపేదలకు కొత్తగా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది.గత ప్రభుత్వంలా కాకుండా లబ్ధిదారులకు రెండు సెంట్ల భూమి ఇచ్చే ఆలోచన చేస్తోంది.

తూర్పున రద్దు లేఅవుట్లు ఇవే

నివాస యోగ్యంకాని 59 లేఅవుట్లు ఇలా ఉన్నాయి.కడియం మండలం వేమగిరి-3 (జడ్పీ స్థలం).కోరుకొండ మండలం నర్సాపురం- కనపూరు రోడ్డు,జగన్నాథపురం-1,రంగంపేట మండలం వడిశలేరు లేఅవుట్-2, చంద్రేడు లేఅవుట్ -1,ముకుందవరం-2,ఈలకొలను, ఈలకొలను-2, నల్లమిల్లి లేఅవుట్ -1, వీరంపాలెం-1, దేవరపల్లి మండలం జగన్నాథపురం రోడ్డులో లేఅవుట్,బుచ్చియ్యపాలెం, కొండగూడెం హౌసింగ్ బోర్డు,గౌరీపట్నం రజకుల చెరువు, యర్నగూడెం పోలేరమ్మ టెంపుల్ లేఅవుట్, కృష్ణపాలెం,ధుమంతునిగూడెం,పల్లంట,కురు కూరు, రాతిగుంటచెరువు లేఅవుట్లు ఉన్నాయి. గోపాలపురం మండలం నందిగూడెం-1, భీమోలు -1 ,వడలకుంట-2,గోపాలపురం- 2,3,4,5, వేళ్లచింతలగూడెం-1,కరగపాడు-2, నల్లజర్ల మం డలం నబీపేట-2, నల్లజర్ల -4, జగన్నా థపు రం-2, అచ్చన్నపాలెం, సింగరాజుపాలెం-1,2,3 లేఅవుట్లు.నిడదవోలు మండలం తాడిమళ్ల -2, శెట్టిపేట టిడ్కో,ఎస్సీ పేట రామాలయం దగ్గర లేఅవుట్.పెరవలి మండలం ఎలిమెంటరీ స్కూల్ దగ్గర లేఅవుట్, అసైన్డ్‌లాండ్ లేఅవుట్, పాల ఆది నారాయణ షెడ్ దగ్గర లేఅవుట్, రవళి స్పిన్నింగ్ మిల్లు వెనుక,ఎస్సీ పుంత, పిరమిడ్ జ్ఞాన మందిర లేఅవుట్, ఉండ్రాజవ రం మండలం అజ్జరం కాలనీ లేఅవుట్లు ఉన్నాయి.



వ్యాన్‌లో తారు కరిగిస్తుండగా మంటలు చెలరేగి దగ్ధమవుతున్న వ్యాన్

వాహనం తారుమాడు!

వేసవిలో ప్రమాదాలు ఎలా జరుగుతాయనేది అనుమానమే..కాస్త ఆదమరుపుగా ఉన్నామా అంతే.. దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో తారు ట్యాంకర్ దగ్ధమే అందుకు నిదర్శనం. ట్యాంకర్‌లో తారు నిల్వచేసినట్టు సమాచారం. బయటకు తీసేందుకు కరిగించే నిమిత్తం వేడి చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలిపోయినట్టు స్థానికులు తెలిపారు. ఈపేలుడు కారణంగా సమీపంలోని రెండు స్లాబులు బీటలు వారాయని , ఎటువంటి ప్రాణనష్టం లేదని తెలిసింది. ఈ మేరకు సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు.ఆస్తినష్టం రూ.లక్షల్లో ఉంటుందని అంచనా వేశారు.ట్యాంకర్ వద్ద మంటలు రావడంతో వాటిని అదుపు చేయడానికి ఫోమ్ ఉపయోగించామని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. - దివాన్‌చెరువు



సివిల్స్ ర్యాంకర్ దొమ్మేటి వినయ్‌ను అభినందిస్తున్న కొవ్వూరు నాయకులు, అధికారులు

ఐఆర్ఎస్ కాదు.. ఐఏఎస్ నా కల!

- 274 ర్యాంక్‌కు ఐఆర్ఎస్ వస్తుంది
- ఐఏఎస్ వచ్చే అవకాశం తక్కువ
- మళ్లీ ఐఏఎస్‌కు ప్రయత్నిస్తా
- సివిల్స్ ర్యాంకర్ వినయ్

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కష్టేఫలి అన్నారు పెద్దలు.. ఆ మాటకు అచ్చు గుద్దినట్టు సరిపోతాడు ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు.. ఐఏఎస్ సాధించాలన్నది అతని కల. అయితే రెండు సార్లు తప్పినా ఒప్పుకోలేదు.. మూడో సారి ప్రయత్నించారు.. 274 ర్యాంక్ సాధించాడు.ఆదివారం స్వగ్రామం కొవ్వూరు చేరుకున్నాడు. ఈ మేరకు పలువురు అభినందనలు తెలిపారు. కొవ్వూరుకు చెందిన డి.జగదీశ్వరరావు విద్యుత్‌శాఖలో కొవ్వూరు పట్టణ ఏఈగా పనిచేస్తున్నారు.తల్లి దుర్గ గృహిణి. జగదీశ్వరరావు పెద్ద కుమారుడు సాయి సంతోష్ జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకుమారుడు దొమ్మేటి వినయ్ పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ఎన్ఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచి సివిల్స్ సాధించాలనే కల ఉండడంతో సాఫ్ట్‌వేర్ వైపు చూడలేదు. బీటెక్ పట్టా అందుకున్న వెంటనే సివిల్స్ ప్రయత్నాలు ఆరంభించాడు. మూడు సార్లు ప్రయత్నం చేశాడు. 2022 తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించినా, ఇంటర్వ్యూలో స్వల్ప మార్కులతో చేజారిపోయింది.రెండో సారి అదే పరిస్థితి. మూడో సారి పొలిటికల్ సైన్సు అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ విభాగంలో ప్రయత్నించి 274వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంక్‌కు ఐఆర్ఎస్ వస్తుందని.. ఐఏఎస్ సాధించాలనే నా కలను మరో ప్రయత్నంలో నెరవేర్చుకుంటానని తెలిపాడు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, కొవ్వూరు రూరల్, గోపాలపురం విద్యుత్ శాఖ ఏఈలు సిహెచ్.శ్రీనివాసరావు, దూసనపూడి శ్రీనివాస్, జేఈ కె.వి.వి.సత్యనారాయణ, మొగళ్ళపు వెంకట్రావు తదితరులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో మంచి పాలన : కొల్లు | 8
భక్తులను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి



చల్లబడుతున్నారు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కిటకిట

సన్..డేస్!



ఈత నేర్పుతా రారా కన్నా : పుష్కరఘాట్ వద్ద చిన్నారితో సరదా..

మండుతున్న ఎండలు - అల్లాడుతున్న జనం

రాజమహేంద్రవరం సిటీ/పెరవలి/ గోపాలపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ప్రచండ భానుడు విజృంభిస్తున్నాడు. వేసవి ప్రతాపంతో వివిధ వర్గాల ప్రజలు అల్లాడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లమీదకు రావాలంటేనే భయపడుతున్నారు.వ్యవసాయ పనులు ఉదయం పది నుంచి 11 గంటల్లోపే ముగిస్తున్నారు. ప్రజానీకంతో పాటు పశుపక్షాదులు వేసవి తాపానికి అల్లాడుతున్నాయి. పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లు వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నట్టు రైతులు వాపోతున్నారు. పాడి పశువుల్లో కూడా పాల దిగుబడి తగ్గిపోతుందని పాడి రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏప్రిల్ నెలల్లో ఎండ తీవ్రత ఈ విధంగా ఉంటే మే నెలల్లో ఇంకెంతగా ఉంటాయోనని రైతులు వాపోతున్నారు. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి భూమి ఉపరితలం వేడెక్కి ఉక్కబోతలు ఎక్కువయ్యాయి. మండుతున్న ఎండలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ నెలలో అత్యధికంగా 42 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. ఉదయం 8 గంటలకే వేడెక్కి రాత్రి 8 గంటల వరకు ఆ వేడి తగ్గుముఖం పట్టక చిన్నపిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. ఏసీలు, కూలర్లు ఉన్నవారు వాటిని 24 గంటలు వినియోగిస్తున్నారు. అధిక వేడి తట్టుకోలేక ప్రజలు గోదావరి స్నానాలకు దిగి సేదతీరుతున్నారు.పుష్కరాలరేవు, ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు చేరుకుని గంటల తరబడి గోదావరిలో స్నానాలు చేస్తూ సేదతీరుతున్నారు. శీతల పానీయాలు, కూల్‌డ్రింక్‌లు అమ్మకాలు పెరిగాయి. సాయంత్రం వేళ రాజమహేంద్రవరం పార్కుల్లో ప్రజలు సేదతీరుతున్నారు.



కోళ్లు విలవిల





భానుడికి చిక్కకుండా ఇలా..



బాబోయ్ భరించలేం : పుష్కరఘాట్ వద్ద ఖాళీగా జంక్షన్



ఐదింటా జోరు.. రెండింటా పోరు!

- టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో నీరసం
- అనపర్తి, నిడదవోలు వెనుకబాటు
- రాజమండ్రి,గోపాలపురంలో నూరు
- రెండు నియోజకవర్గాల్లో 70 శాతం
- కొవ్వూరులో 54.35 శాతం
- అధిష్ఠానం తీరుపై అసంతృప్తి
- కూటమి ప్రభావమేనా?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
జిల్లాలో సంస్థాగత ఎన్నికల జోరు పెరిగింది. టీడీపీ ఎమ్మెల్యేలు లేని చోట నేతలపై కూటమి ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలు నీరసంగా ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నుంచి టీడీపీ నేతలకు సరైన గుర్తింపు రాకపోవడమే కారణమనే ప్రచారం సాగుతోంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పొత్తు కారణంగా టీడీపీ నేతలు అవకాశాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి సరైన ప్రాధాన్యత ఇస్తామని అప్పట్లో అధిష్ఠానం చెప్పడంతో పాటు పార్టీ విజయానికి సహకరించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నా అధిష్ఠానం పట్టించుకోకపోవడంపై కాస్త అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరికి మాత్రం రుడా చైర్మన్ పదవి దక్కింది. నిడదవోలు నుంచి త్యాగం చేసిన బూరుగుపల్లి శేషారావుకు ఏ విధమైన గుర్తింపు లభించలేదు. అనపర్తి సీటు బీజేపీకి కేటాయించినా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి టీడీపీ వ్యవహారాలు చూస్తున్నారు. అధికారికంగా ఎటువంటి నియామకం జరగలేదు. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికల్లో బాగా వెనుకబడినట్టు సమాచారం.పాత వర్గాలతో పాటు కొత్త వర్గాల నుంచి నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారు.రాజమహేంద్రవరం నగర టీడీపీ అధ్యక్ష పదవి బీసీ వర్గాలకు దక్కే అవకాశం ఉంది. ఇక్కడ బీసీల నుంచి చాలా మంది ఆశిస్తున్నా రు.మిగతా నియోజకవర్గాల్లో పట్టణ, మండల కమిటీల్లో కొత్తవారు వచ్చే అవకాశాలున్నాయి.

60 మంది ఓటర్లకు ఒక సారథి

60 మంది ఓటర్లకు ఓ కుటుంబ సాధికార సారథి (కెఎస్ఎస్) ఉంటారు. ఇందులో ఇద్దరు సభ్యులు ఒకరు మహిళ, ఒకరు పురుషుడు ఉంటారు. తర్వాత బూత్ గ్రామ, మండల, పట్టణ, డివిజన్, నియోజకవర్గ, పార్లమెంట్ పరిధి కమిటీలతో పాటు, వాటి అనుబంధ కమిటీల ఎన్నికలు పూర్తి కానున్నాయి. ఈనెల 30వతేదీ లోపు క్లస్టర్, యూనిట్, మండల , పట్టణ, డివిజన్ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం కూడా పూర్తి కావాలి. మేనెల 1 నుంచి 7వ తేదీ వరకూ నియోజకవర్గాల అనుబంధ కమిటీల నియామకం జరగాలి. మే నెల 8 నుంచి 15వ తేదీ వరకూ పార్లమెంట్ కమిటీలు,అనుబంధ కమిటీలను నియమించాలి.మే నెల చివరలో కడప జిల్లాలో మహానాడును బ్రహ్మాండంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలు పెట్టారు.

ఏ నియోజకవర్గంలో ఎలా..

ఈనెల 14వ తేదీ నుంచి ఎన్నికల సందడి మొదలైన సంగతి తెలిసిందే.కుటుంబ సాధికార సారథుల పదవులు ఇప్పటికే చాలా చోట్ల పూర్తి చేశారు. రాజమహేంద్రవరం సిటీలో కుటుంబ సాధికార సారథులు(కెఎస్ఎస్)లు 4237 నియమించాల్సి ఉంది.ఒక్కో సారధికి ఇద్దరు సభ్యులు ఉంటారు.అంటే 8474 మందిని నియమిం చాల్సి ఉంది.ఇప్పటికే 8498 మంది నియమించారు. గోపాలపురంలో మొత్తం 4044 కెఎస్ఎస్ ఉండగా 8088 మందిని నియమించాల్సి ఉంది.కానీ 8090 మందిని నియమించి 100.02 శాతం నియామకాలు పూర్తి చేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 4481 కెఎస్ఎస్‌లకు 7198 మందిని నియమించాల్సి ఉండగా ఇప్పటి వరకూ 5398 మంది నియమించి 74.99 శాతం పూర్తి చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కమిటీలతో పాటు మండల స్థాయి కమిటీని నియమించడానికి సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానున్నట్టు సమాచారం. రాజానగరంలో టీడీపీ ఎమ్మెల్యే లేనప్పటికీ, అక్కడి ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ నాయకత్వంలో కమిటీలు జరుగుతున్నాయి. ఇక్కడ 3599 కెఎస్ఎస్‌లకు 7198 మంది సభ్యులను నియమించాల్సి ఉండగా 5398మందిని నియమించి 74.99 శాతానికి చేరుకున్నారు. కొవ్వూరులో 3060 కెఎస్ఎస్‌లకు 6120 మంది సభ్యులను నియమించాల్సి ఉండగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో 3326 మంది 54.35 శాతం మాత్రమే నియామకాలు పూర్తిచేశారు. నిడదవోలులో 3542 కెస్ఎస్‌లకు 7084 మందిని నియమించాల్సి ఉండగా 2509 మందిని మాత్రమే నియమించారు. ఇది కేవలం 35.42 శాతం.ఇక్కడ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు ప్రాధాన్యత ఇవ్వలేదనే ఆగ్రహం పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది. ఇక అనపర్తిలో సంస్థాగత ఎన్నికల సందడే కనిపించడం లేదు. బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తనయుడు, టీడీపీ నేత మనోజ్ రెడ్డి టీడీపీ తరఫున చురుగ్గా ఉన్నా కమిటీల నియామకం జీరో అని చెప్పవచ్చు.ఇక్కడ మొత్తం 3767 కెఎస్ఎస్‌లకు 7534 మందిని నియమించాల్సి ఉండగా కేవలం 66 మందిని మాత్రమే నియ మించారు. ఇది కేవలం 0.88 శాతమే. ఈ నెల 20వ తేదీకి సారథుల నియామకం పూర్తి కావాల్సి ఉంది.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సుందరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


ఆలయంలో మహాన్యాస పఠనం చేస్తున్న పండితులు

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామికి ఆదివారం లక్షబిల్వార్చన నిర్వహించారు. గోష్పదక్షేత్ర లక్షపత్రి, లక్ష కుంకుమ పూజా కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో గణపతిపూజ, మహాన్యాస పఠనం, పంచామృత అభిషేకాలు, బిల్వపత్రి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, స్వామివారికి లక్షబిల్వార్చన చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు, సుందర గణేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం : సుంకర


గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సుంకర సత్తిబాబు అన్నారు. డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు ఆదివారం కొవ్వూరు పట్టణంలోని ప్రజలకు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని విడనాడాలని అవగాహన కల్పిస్తూ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకర సత్తిబాబు మాట్లాడుతూ మానవ మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్‌ను విడనాడి, గుడ్డ సంచులను మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో గంగుమళ్ల స్వామి, పోలిశెట్టి శివ, కె. సతీష్, ఎం.శేఖర్, ఎం. బాలకృష్ణ, బి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన దూపహారతి, నరిత్య అర్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 27,160, అన్నదానానికి రూ. 22,370, ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 9,994, పూజా టికెట్ల ద్వారా రూ. 50,050 కలిపి మొత్తం రూ. 1,09,574 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం ఈవో, సహాయ కమిషనర్ వి. హరి సూర్యప్రకాష్ తెలిపారు.

డ్రైనేజీల్లో మురుగు తొలగించండి



దేవరపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్నగూడెం దళితవాడ మురుగు నీటితో కంపుకొడుతోంది.ప్రధానంగా డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి పోవడం వల్ల ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశం ఉందని, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురుగును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో మంచి పాలన : మంత్రి కొల్లు


ఘంటావారిగూడెం జాతరకి విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మద్దిపాటి



నల్లజర్ల, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి వెళితే ఎక్కడా పవిత్రత అనేది కనిపించలేదని ప్రస్తుతం రాష్ట్రంలో మంచి పాలన కొనసాగిస్తున్నామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో జరుగుతున్న గంగాలమ్మ తల్లి జాతరకు మంత్రి విచ్చేశారు. ఈయనతోపాటు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీమంత్రి పీతల సుజాత, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు ఆచంట సునీత పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈరోజు అదే ఆలయానికి వెళితే మనస్సుకు ప్రశాంతత కలిగిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుల, మతాల మధ్య చిచ్చు పెట్టొద్దన్నారు. అందుకు భగవంతుడు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాడన్నారు. అందుకే 164 సీట్లను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 259 కోట్ల మత్స్యకార కుటుంబాలకు రూ. 20 వేలు చొప్పున్న అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఘంట వారిగూడెంలో 100 సంవత్సరాల తరువాత జాతర జరగడం ఆనందదాయక మన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్‌మీరా సాహెబ్, కూచిపూడి ఉదయ భాస్కర్, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ 'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం


ఎన్టీఆర్ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో 2005 - 2006 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. 20 ఏళ్ల తరువాత ఇలా కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దీనిలో భాగంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో మల్లపు నాగరాజు, షేక్ హబీబ్, ఉప్పులూరి రాధాకృష్ణ, మోర్త ప్రమోద్‌కుమార్, షేక్ షాకీర్, ఉపాధ్యాయులు సూర్యచంద్ర మాస్టర్, శేషకుమార్ మాస్టర్, సోంరాజు మాష్టార్, లక్ష్మీ టీచర్, బేగం టీచర్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999 - 2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. ముందుగా పాఠశాలలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి అప్పటి ఉపాధ్యాయులతో జ్యోతిప్రజ్వలన చేయించారు. స్థానికంగా ఉన్నవారితో పాటు పలుదేశాలు, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వారు రూ. మూడులక్షలతో విద్యార్థులు చదువుకునేందుకు మధ్యాహ్న భోజనం చేసేందుకు రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులచే రేకుల షెడ్డు ప్రారంభించి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. 120 మంది విద్యార్థులకు గాను సుమారు 80 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.


గోపాలపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా వేలివెన్నులో జాతర

ఉండ్రాజవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేలివెన్నులో మహంకాళమ్మ, ముత్యాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కుంకుమ పూజలు చేశారు. తర్వాత వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

పాలంగిలో 'మానవత' సమావేశం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ మండల సమావేశాన్ని ఆదివారం పాలంగిలో నిర్వహించారు. దీనిలో భాగంగా ఈ సంస్థకు విరాళాలు అందజేసిన నెక్కంటి సుధాకర్, నామాల శివరామకృష్ణను సత్కరించారు. అనంతరం సంస్థకు సంబంధించిన డైరీని ఆవిష్కరించారు. గత నెలలో సంస్థ చేసిన సేవాకార్యక్రమాలు, మే నెలలో చేసే సేవా కార్యక్రమాలు గురించి చర్చించారు. కార్యక్రమంలో సంస్థ మండల అధ్యక్షుడు కె. సిద్ధార్థరాజు, సంస్థ నాయకులు తాతిన కృష్ణారావు, వెలిచేటి బోసు, కె. మాణిక్యాలరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు


సూర్యచంద్రం

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని పోస్టాఫీసు వీధికి చెందిన బొరుసు సూర్యచంద్రం ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. దీంతో చుట్టుపక్కల బంధువుల ఇంటివద్ద వెతికినా కనిపించకపోవడంతో భార్య ఆదిలక్ష్మి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 94407 96622, 9154875583 నెంబర్లకు సమాచారం అందజేయాలని సూచించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నిడదవోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తెలిపారు. నిడదవోలు సంతమార్కెట్ రోడ్‌లో ఓ నివాసం నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా, నంబూరి మధుకర్ (49) మృతి చెంది ఉన్నాడు. రెండు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు మానసిక జబ్బుతో బాధపడుతుండేవాడని, ఎవరితోనూ మాట్లాడేవాడు కాదని స్థానికులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేపు ఫిషింగ్ లైసెన్స్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న నిర్మలాకుమారి

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో చేపల వేట చేసే మత్స్యకారులకు ఈనెల 29వ తేదీన ఫిషింగ్ లైసెన్సుపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్టు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ టి. నిర్మలాకుమారి తెలిపారు. పట్టణంలోని వీఐపీ ఘాట్ శివాలయం వద్ద ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు చెక్క పడవలు (నావలు) తెప్పలు (ఫైబర్‌బోట్లు)పై చేపల వేట చేసే మత్స్యకారులకు సమన్వయశాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నాలుగోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా సింహాద్రి ఏకగ్రీవం



ఉండ్రాజవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన సింహాద్రి రామకృష్ణ ఏకగ్రీవంగా నాలుగోసారి ఎన్నికయ్యారు. ఆదివారం వేలివెన్నులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తున్నట్టు చెప్పారు. మండలంలో పార్టీ కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తల సహకారంతో ముందుకు తీసుకువెళతున్నట్టు ఆయన చెప్పారు. తనను నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

నలుగురి అరెస్టు

కొవ్వూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుండాట ఆడుతున్న నలుగురి వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. పెనకమెట్టలో గుండాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఇందులో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1940 నగదు, నెంబర్ ఫ్లెక్సీ, ఆరు గుళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు సద్వినియోగం చేసుకోండి

నల్లజర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల శాఖా గ్రంధాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు జరిగే వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నల్లజర్ల శాఖా గ్రంథాలయ నిర్వాహకురాలు ఏవీ రమణ పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. 10 నుంచి 15 సంవత్సరాల వయసు కలిగినవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయంలో పుస్తకాల పఠనం, కథలు చెప్పించడం, ఇంగ్లీషు మాట్లాడించడం, చిత్రలేఖనం, కాగితాలతో చేతి పనులు చేయించడం, సంగీతం, సరదా కబుర్లు చెప్పుకునే సమావేశాలు, కంప్యూటర్ నేర్పించడం, నిష్ణాతులచే జనరల్ నాలెడ్జ్ తర్ఫీదు ఇప్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాల్సిందిగా కోరుతున్నట్టు పేర్కొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని (సమ్మర్‌క్యాంపు) ప్రారంభిస్తున్నట్టు లైబ్రేరియన్ జీవీవీఎస్ త్రినాథ్ తెలిపారు. వేసవి సెలవులను బాలబాలికలు ఆనందంగా, ఆహ్లాదముగా వినియోగించుకోవడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు మే 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. 10 నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన లేదా 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఇందులో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, డ్రాయింగ్, సంగీతం, క్రాఫ్ట్, డాన్స్, స్పోకెన్ ఇంగ్లీషు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన వివిధ అంశాలు నేర్పించడం వంటి సృజనాత్మక కార్యక్రమాలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నేర్పిస్తామన్నారు. శిబిరం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాళ్లపూడి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఏ. నరేష్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు చెప్పడం, చదివించడం, చిత్రలేఖనం, క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్, అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలి : మాజీ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి అభివృద్ధికి ప్రతి కార్యకర్త సమష్టి కృషితో పనిచేయాలని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వేలివెన్నులో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో సంస్థాగత కమిటీలు, కార్యక్రమాలు ఉన్నాయని, వాటి కోసం సమన్వయంతో పని చేయాలని కోరారు. నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించారని, ఆయన ప్రకటనను పార్టీ ఆమోదించలేదని, ఆయన సేవలు పార్టీకి అవసరమని చెప్పారు. కుటుంబ సాధికార సారథులు, బూత్ కమిటీలు, గ్రామ, మండల కమిటీలు త్వరగా పూర్తిచేయాలని శేషారావు నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. నియోజవర్గ టీడీపీ పరిశీలకు డి. సత్యనారాయణ మాట్లాడుతూ నియోజవర్గంలో పార్టీకి సంబంధించి అన్ని కమిటీలు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల శ్రీను, తిరుపతి సత్యనారాయణ, నియోజవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎండ ప్రతాపం

● బయటకు రావాలంటే హడలిపోతున్న ప్రజలు

పెరవలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండప్రతాపం పెరుగుతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్ల మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పనులపై బయటకు వస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా ఉదయం పది నుంచి 11 గంటలలోపే ముగించేస్తున్నారు. పౌల్ట్రీఫారాల్లో కోళ్లు మృత్యువాతపడుతున్నట్టు కోళ్ల రైతులు వాపోతున్నారు.పాడి పశువుల్లో కూడా పాల దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు.


తీవ్రతలో మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా మెయిన్‌రోడ్డు


ఎండలో వెళుతున్న మేకలు, గొర్రెలు



పదో తరగతి విద్యార్థులకు నగదు పురస్కారం


మానవత సంస్థ సభ్యులు అందించిన సర్టిఫికెట్లతో విద్యార్థులు

తాళ్లపూడి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మానవతా సంస్థ ఆధ్వర్యంలో మండలంలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన 13 మంది విద్యార్థులకు సంస్థ తరపున రెండు వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, సంస్థ మెమెంటో అందించామని అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ ఛైర్మన్ సింహాద్రి జనార్దనరావు పాల్గొని మాట్లాడుతూ సంస్థ విద్యకు, వైద్యానికి అధిక మొత్తంలో అందిస్తుందని విద్యార్థులు ఉన్నతస్థితిలో నిలిచి జన్మనిచ్చిన తల్లితండ్రులకు, పుట్టిన ఊరికి మంచిపేరు తేవాలని కోరారు. అంతేకాక పేద విద్యార్థులు విద్యకు ఎటువంటి అవరోధాలు ఏర్పడిన యెడల తనను సంప్రదిస్తే తగు సహాయం అందిస్తానని తెలిపారు. ఎంఈవో నెహ్రూరాజీ మాట్లాడుతూ సంస్థ ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తూ తగిన సహాయ సహకారాలు అందిస్తున్న మానవతా సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గోకవరపు బాబులు, దుగ్గిరాల సూర్యనారాయణ, అప్పన హనుమంతరావు, సనపల రాజశేఖర్, పెమ్మాడి దుర్గాప్రసాదు, టీఎన్‌బీ గుప్త, తదితర మానవతా సంస్థ సభ్యులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనం కోసం వెళుతున్న...

భక్తులను ఢీకొన్న లారీ

● చికిత్స పొందుతూ ఒకరి మృతి... మరో ఇద్దరి పరిస్థితి విషమం

నల్లజర్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి నుంచి ద్వారకాతిరుమలకు దైవదర్శనం కోసం కాలినడకన వెళుతున్న భక్తులను లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలివి ... ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో దేవరపల్లికి చెందిన బిరదా అంజి (28) మృతిచెందగా, దేవరపల్లికి చెందిన దాను దుర్గాప్రసాద్, జాజు మొగ్గల సాయితేజ గాయపడ్డారు. శనివారం రాత్రి దేవరపల్లి నుంచి ద్వారకాతిరుమలకు దైవదర్శనం కోసం కాలినడకన వీరు బయలు దేరారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడు హైవే వద్దకు వచ్చే సరికి వైజాగ్ నుంచి బళ్లారికి ఇనుప ఊసలు తీసుకెళుతున్న లారీ వెనుక నుంచి వచ్చి వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజి రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం కాగా, మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంజిని తరలిస్తుండగా మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మే 14వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు రాజమహేంద్రవరం నుంచి సూపర్‌లగ్జరీ ప్రత్యేక బస్సులు బయలుదేరి యాదగిరిగుట్ట, బాసర, ధర్మపురి, కాళేశ్వరం (సరస్వతి పుష్కరస్నానం), కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్ప క్షేత్రాలు దర్శించుకుని సరస్వతి పుష్కర స్నానం అనంతరం తిరిగి చేరుకుంటాయని తెలిపారు. నాలుగు రోజుల యాత్రలో 8 క్షేత్రాలు దర్శించుకోవచ్చని, టిక్కెట్లు ఛార్జీ ఒక్కరికి రూ.3,900 అని తెలిపారు. దీన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.